## క్లుప్తంగా

### మూర్తికుంభ స్థాపన.. అగ్నిప్రతిష్ఠ

శాస్త్రోక్తంగా నాచగిరీశుని జయంత్యుత్సవాలు



హవనం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో స్వామివారి జయంత్యుత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు ఉదయం 7.30గంటలకు యాగశాల ప్రవేశం జరిగింది. అర్చక స్వాములు మంత్రోచ్ఛరణలతో మూర్తి కుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శన నారసింహ మూలమంత్ర హవనములు చేశారు. పూర్ణాహుతి జరిపారు. సాయంత్రం హవనాది కార్యక్రమాలు కొనసాగాయి. ఉత్సవాలలో భక్తులు పాల్గొని తరించారు.

### సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బెజ్జంకి(సిద్దిపేట): పచ్చిరొట్టకు సంబంధించిన జీలుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై బెజ్జంకి ఆగ్రోస్‌లో లభిస్తున్నాయని ఏఓ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.1,120కే 30కిలోల జీలుగ, రూ.1,450కే 40కిలోల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 2ఎకరాలకు ఒక బస్తా వినియోగించాలని సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తుక్కాపూర్ ఏడీఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. 8 నుంచి 10వరకు విద్యుత్ నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.

**ప్రశాంత్‌నగర్‌లో..**

చెట్ల కొమ్మలు తొలగిస్తుండడంతో మంగళవారం ఉదయం 7 నుంచి 9 వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

**దుబ్బాక రూరల్‌లో..**

హబ్సిపూర్, దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట మండలాల్లోని సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతులు చేపట్టడం వల్ల ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ రాంబాబు తెలిపారు.

### చేపల అపహరణపై ఫిర్యాదు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిళ్లాపూర్ పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు చేపల చోరీకి పాల్పడడంతో సోమవారం ముదిరాజ్ సంఘం పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తమకు కొందరు నష్టం చేకూర్చే విధంగా వ్యవరిస్తున్నారని వాపోయారు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో అక్రమంగా చెరువుల్లోకి ప్రవేశించి చేపల వేటసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

### పథకాలకు నిధులు కేటాయింపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం హర్షణీయమని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల్ల కృష్ణారెడ్డి అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. శ్రీనివాస్, కొండు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించండి



ఇంటింటి ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి కోరారు. సోమవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నిమ్మ రాజీవ్‌రెడ్డి, చంటి, సతీశ్, నాగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, శ్రీధర్, భాస్కర్, వెంకటేశ్, నరేశ్, గణేశ్ ఉన్నారు.

# శ్రీకృష్ణా.. ముకుందా..

**నేటి నుంచి బ్రహ్మోత్సవ సంరంభం**

- ముస్తాబైన వేణుగోపాలుని కోవెల
- పదకొండు రోజులపాటు విశేష కార్యక్రమాలు

వర్గల్(గజ్వేల్): పురాతన ప్రాశస్త్యం కలిగి ఎనిమిది శతాబ్దాల క్రితం నిర్మితమైన భవ్య మందిరం వర్గల్ శ్రీవేణుగోపాలుని కోవెల. రాతి స్తంభాలు.. చక్కగా తీర్చిదిద్దిన చెక్కడాలు.. నాటి చరిత్రకు, శిల్పకళా ప్రావిణ్యానికి ఆనవాళ్లుగా నిలిచాయి. మండల కేంద్రంలోని ఈ ఆలయం 21వ తేదీ మంగళవారం నుంచి పదకొండు రోజులపాటు అంగరంగవైభవంగా జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.

**భాగ్యనగరానికి చేరువలో..**

హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలకు 50కిలోమీటర్ల దూరంలో రాజీవ్ రహదారికి చేరువలో వర్గల్ గ్రామ నడిబొడ్డున ఈ ఆలయం ఉంది. గీతాజ్ఞాన మండలి, దాతలు, ప్రభుత్వ సహకారంతో ఈ ఆలయ జీర్ణోద్ధరణ జరిగి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నది. నిత్యపూజలు, విశేష కార్యక్రమాలతో భక్తజనాదరణ చూరగొంటోంది. అత్యంత వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలలో భక్తులు పాల్గొని తరించాలని గీతాజ్ఞాన మండలి ప్రతినిధులు కోరారు.



రాతితో నిర్మితమైన ఆలయం

### బ్రహ్మోత్సవాల వివరాలు

- వైశాఖ శుద్ధ త్రయోదశి మంగళవారం 21న ఉద యం 6.30కు బాలభోగం, సాయంత్రం మృత్సంగ్రహనం, అంకురార్పణ
- 22న ఉదయం ధ్వజారోహణం, గరుడ కల్యాణం, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం భేరీ పూజ, దేవతాహ్వానం
- 23న ఉదయం అష్టోత్తర శత కలశాభిషేకం, రాత్రి 10గంటలకు తిరుకల్యాణమహోత్సవం
- 24న రాత్రి గరుడ వాహనోత్సవ సేవ
- 25న రాత్రి గజవాహనోత్సవసేవ
- 26న రాత్రి హనుమత్ వాహనోత్సవసేవ
- 27న రాత్రి శేషవాహనోత్సవ సేవ
- 28న రాత్రి పొన్నవాహన సేవ
- 29న సుదర్శన హోమం
- 30న ఉదయం 4.30 గంటలకు రథ ప్రతిష్ఠ, పురవీథుల్లో స్వామివారి విమాన రథోత్సవ ఊరేగింపు
- 31న శతఘటాభిషేకం, చక్రతీర్థం, వసంతోత్సవం, పుష్పయాగం జరుగుతుంది.



రుక్మిణి, సత్యభామ, శ్రీవేణుగోపాలస్వామి

# ధాన్యం కొనుగోలులో కోతపెట్టొద్దు

**బీజేపీ నాయకుల వినతి**

హుస్నాబాద్‌రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి నష్టపోతున్నారని, వెంటనే దానిని కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యానికి బస్తాకు 4కిలోలు కోత పెడుతున్నారని, తూకం వేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, సంతోష్, చందు, సంపత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి..**

కోహెడ(హుస్నాబాద్): రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి, వరి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు ఇస్తానన్న రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని, రైతు భరోసాద్వారా ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రజనీకాంత్‌రెడ్డి, సతీశ్, కరుణాకర్ రాజురెడ్డి, సాగర్, సుమన్, అజయ్, లక్ష్మణ్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

**గ్యారంటీలను విస్మరించి..**

బెజ్జంకి(సిద్దిపేట): ఇచ్చిన గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆరోపించారు. హామీలు అమలుపై ఆ పార్టీ నేతలు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగరవి, జ్యోతి, సంపత్, రామచంద్రం, లవణ్, సునీత, లావణ్య, కనకయ్య, కిషన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్: తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

**బోనస్ ఇవ్వాలి..**

సిద్దిపేటరూరల్: అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు రూ.500బోనస్ హామీ అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మైహిపాల్ రెడ్డి, కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రాజు, తిరుపతి రెడ్డి, కృష్ణ ఎగొండ తదితరులు పాల్గొన్నారు.

**కష్టాల్లో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలి**

అక్కన్నపేట(హుస్నాబాద్): అకాల వర్షలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు జరగకపోవడం విచారకరమన్నారు.

# యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

**పరిశోధన సంచాలకుడు డా.ఉమారెడ్డి**

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలంగాణ మండల పరిశోధన సంచాలకుడు డా.ఉమారెడ్డి సూచించారు. సోమవారం చిన్నకోడూరు రైతువేదికలో 'వానాకాలం పంటలపై ముందస్తు ప్రణాళిక' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కదశను బట్టి ఎరువులు వేయాలన్నారు. 15 నుంచి 20 రోజులకు 30కిలోల యూరియా వేయాలని, అలా వేసినప్పుడు 48గంటల తరువాత వరి పంటకు నీరు పెట్టాలని వివరించారు. వరికి తక్కువ యూరియా ఎక్కువ సార్లు వేయాలని సూచించారు. వరిలో వేదజల్లే పద్ధతి గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఏఓ జయంత్ కుమార్, శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.ఉమారెడ్డి

### దళితుల అభివృద్ధికి ప్రణాళికలు అవసరం



మాట్లాడుతున్న వినయ్ కుమార్

మిరుదొడ్డి(దుబ్బాక): దళితుల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్ కోరారు. మండల పరిధిలోని లింగుపల్లిలో పితృవియోగంతో బాధపడుతున్న డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కుటుంబాన్ని సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలల్లో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భరోసా పథకం అమలుకు రాష్ట్ర ప్రభు త్వం మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వేణు, భీమ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మృతదేహం లభ్యం



మృతదేహం

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం స్థానికులు కోమటి చెరువులో ఓ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రి మార్చు రీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40నుంచి 50 ఏళ్లు ఉంటుందని, 5.2 అడుగుల ఎత్తు, చామన చాయతో ఉండి తెలుపు రంగు షర్ట్, నలుపు రంగు పాయింట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. సమాచారం తెలిస్తే సంప్రదించాలని చెప్పారు.

# ఉదారత్వం..

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హెడ్‌కానిస్టేబుల్ సయ్యద్ సలీమ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1995వ బ్యాచ్ పోలీస్ సిబ్బంది ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. అంతా కలిసి రూ.లక్ష నగదును సలీమ్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాచ్ మిత్రులు పాషా, శ్రీనివాసరావు, నర్సింగరావు, రాజమల్లు, అనిల్, ప్రభాకర్, మల్లికార్జున్ రెడ్డి, త్రీటౌన్ ఎస్ఐ విజయ్ భాస్కర్ ఉన్నారు. -సిద్దిపేటజోన్



నగదు అందజేస్తున్న బ్యాచ్ మేట్స్

# సమాజంపై అవగాహన కల్పించాలి

**సివిల్ కోర్టు జడ్జి ప్రియాంక**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడం ఎంతో ముఖ్యమని గజ్వేల్ సివిల్ కోర్టు జడ్జి ప్రియాంక పేర్కొన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో 1రోజులుగా జరుగుతున్న బాల సంస్కార్ సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా సోమ వారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థు లకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి సమ్మర్ క్యాంపుల వల్ల విద్యా ర్థుల్లో సృజనాత్మక శక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కూరగాయల మా ర్కెట్ ఆధ్వర్యంలో అందజేసిన బీరువాను ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ్యోతి, ఆకుల నరేష్‌బాబు, డాక్టర్ వంగాల రంగాచారి, హెచ్‌ఎం హరిణాపవన్, శిక్షకులు వినోద, లక్ష్మి, పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.



బీరువాను అందజేస్తున్న వ్యాపారులు

# కేంద్రంలో కాంగ్రెస్ కూటమిదే అధికారం

**టీపీసీసీ సభ్యుడు శ్యామ్ మోహన్**

సిద్దిపేటఅర్బన్: కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, 260 నుంచి 270సీట్లు వస్తాయని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం సభ్యుడు అనంతుల శ్యామ్ మోహన్‌అన్నారు. సోమవారం సిద్దిపేట శివారులోని హరిత హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు చేపట్టిన పాదయాత్ర ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 నుంచి 12ఎంపీ స్థానాలు గెలవనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో కూడా కాంగ్రెస్ పార్టీకి మంచి స్పందన వచ్చిందన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్టు తెలిపారు. సమావేశంలో మహేందర్, సతీష్ గౌడ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌మోహన్

# అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీఆర్ఎస్సే



బీమా చెక్కును అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

కొండపాక(గజ్వేల్): నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీఆర్ఎస్సేనని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త వేణుమాధవ్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల బీమా చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 97,500 మందికి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల పేరిట బీమా చేశారన్నారు. ఇప్పటివరకు 344మందికి రూ. రూ.6.80 కోట్లు బీమా సొమ్ము అందజేశారని చెప్పా రు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, నాయకులు దేవీరవీందర్, కోల సద్గుణ, కోల రవీందర్, ర్యాగల్ల దుర్గయ్య, మల్లం ఐలయ్య, సంపత్, పాల శంకర్, కొంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

**బీరప్ప కల్యాణ వేడుకల్లో..**

గజ్వేల్: అహ్మదీపూర్‌లో నిర్వహిస్తున్న బీరప్ప–కామరాతి కల్యాణ వేడుకల్లో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరప్ప ఆశీస్సులతో గొల్లకురుమలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ గౌడ్, ఎంపీటీసీ ఆనందం ఉన్నారు.

# హనుమాన్ దీక్ష ..ఆధ్యాత్మిక రక్ష

- మాలధారణం.. నియమాల తోరణం
- గ్రామాల్లో మార్మోగుతున్న శ్రీరామ నామం
- వెల్లివిరుస్తున్న భక్తిభావం

వయసుతో సంబంధం లేకుండా చిన్నారుల నుంచి పెద్దల వరకు హనుమాన్ దీక్ష తీసుకుని ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భక్తిభావాన్ని నింపుకుంటున్నారు. గ్రామాల్లో సైతం హనుమాన్ దీక్షలు ఎక్కు వగా స్వీకరిస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో సుమారు 5వేల మంది దీక్షలు తీసుకున్నారు. దీంతో శ్రీరామనామ జపంతో గ్రామాలు మార్మోగుతున్నా యి. గ్రామాల్లో ఎక్కడ చూసినా హనుమాన్ మాలధరించిన స్వాములే దర్శనమిస్తున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): హనుమాన్ దీక్ష అన్ని దీక్షల కంటే కఠినమైనదిగా చెబుతారు. ఈ దీక్షను 41రోజులు(మండలం), 21రోజులు(అర్ధ మండలం), 11రోజులు(ఏకాదశ) దీక్షలుగా పేర్కొంటారు. ఈ స్వాములు హనుమంతుడికి అత్యంత ప్రీతికరమైన సింధూరపు రంగు వస్త్రాలను ధరిస్తారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి జపతపాలను ఆచరిస్తారు. మధ్యాహ్న సమయంలో తిరిగి స్నానం చేసి ఒంటిపూట భోజనం చేస్తారు. రాత్రివేళలో భజనలు, కీర్తనలు భక్తిశ్రద్ధలతో పాడుకుంటారు. అదే విధంగా హనుమాన్ చాలీసా పారాయణం చేస్తారు.

**జూన్ 1న హనుమాన్ జయంతి**

చాలా మంది యువకులు ఆధ్యాత్మిక బాటను ఎంచుకుని హనుమాన్ దీక్షలు స్వీకరించారు. అందులో భాగంగా నియమనిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించడంతోపాటు ఆంజనేయుడిని నిత్యం ఆరాధిస్తున్నారు. ఈ దీక్షలు తమలో ఆధ్యాత్మిక భావంతోపాటు ప్రశాంతతను కలిగిస్తాయని వారు పే ర్కొంటున్నారు. దీక్షా పరులు నిత్యం జైశ్రీరామ్.. జై హనుమాన్ అంటూ నిత్యం నామస్మరణ చేస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జూన్ 1న హనుమాన్ జయంతి రోజున మాల విరమణ చేస్తారు.



హోమం నిర్వహిస్తున్న స్వాములు

### మానసిక ప్రశాంతత



నేను 9ఏళ్లుగా హనుమాన్ దీక్షను తీసుకుంటున్నాను. ఈ దీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీక్ష సమయంలో ఆచరించే మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండవచ్చు. స్వామి నామస్మరణతో బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం పెరుగుతాయి.

-ఎం.బాపయ్య, అనంతసాగర్

### చెడు అలవాట్లు దూరం..



ఏడాదికి ఒకసారి ఈ మాలధారణ తీసుకోవడంతో చెడు అలవాట్లు దూరమవుతాయి. ఎంతో పుణ్య ఫలం దక్కుతుంది. హనుమాన్ నామ స్మరణతో భయాలు కూడా తొలగిపోతాయి.

-రాజు, చిన్నకోడూరు

### ఎన్నికలు జరపాలంటూ వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

హుస్నాబాద్: స్థానిక బాలవికాస వాటర్‌ప్లాంట్ల నిర్వహణ కమిటీకి ఎన్నికలు జరపాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌కు బీసీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. సోమవారం వారు మాట్లాడుతూ పదేళ్ల క్రితం మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య హయాంలో హుస్నాబాద్, ఆరపల్లె ప్లాంట్లకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాలని అలాంటిది పదేళ్ల గడిచినా ఎన్నికలు లేవని వాపోయారు. దీంతో ఆ సంస్థలు ఎటువంటి పన్నులు చెల్లించడం లేదని వాపోయారు. మూడు ప్లాంట్లు బంద్ చేశారని, టాబాల్లో ఉన్న ప్లాంట్లను ఎందుకు బంద్ చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రవీందర్ గౌడ్, అనంత స్వామి, సంతోష్ ఉన్నారు.

**పైపులైన్లు పగలడం వల్లే..**

హుస్నాబాద్: ప్లాంట్‌ల మూసివేతపై ఇచ్చిన ఫిర్యాదుపై బాల వికాస వాటర్ ప్లాంట్ అధ్యక్షుడు వరయోగుల శ్రీనివాస్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్లు పగిలిపోవడం వల్లే నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని చెప్పారు. అలాగే మరో రెండు ప్లాంట్లల్లో మోటర్లు కాలిపోయి, ఒకేసారి సమస్యలు తలెత్తాయని, త్వరలోనే మరమ్మతులు చేపడతామని శ్రీనివాస్ తెలిపారు.